www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 అక్టోబర్ 2024



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పోరాటాల ద్వారానే
రాజ్యాధికారం సాధ్యం

- సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి
- అన్నమయ్య జిల్లాలో ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి
- మతోన్మాదమే ఆయుధంగా ప్రజలను చీలుస్తున్న కాషాయనేతలు
- రూ. లక్షకోట్లు కేటాయిస్తే అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధి చెందుతుంది
- జిల్లా ప్రథమ మహాసభల్లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్


మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి - రాయచోటి

రాజ్యాధికారాన్ని దక్కించుకునేలా పేదలు, కార్మికులు సంఘటితంగా పోరాటాలు చేయాలని సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు గఫూర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని చిత్తూరు రోడ్డులో కెజిఎస్ ఫంక్షన్ హాల్లో సిపిఎం అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటగా సిపిఎం శ్రేణులు పట్టణంలోని నేతాజీ సర్కిల్ నుంచి బొంబాయి లాడ్జి, గునిగుంట్ల రోడ్, చెక్ పోస్ట్ మీదుగా చిత్తూరు మార్గంలోని కెజిఎస్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీని నిర్వహించారు. పట్టణ ప్రజలు, పార్టీ సానుభూతి పరులు పాల్గొని ఎర్రజెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఫంక్షన్ హాల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. సిపిఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. మహాసభకు అధ్యక్షవర్గంగా సి. హెచ్ చంద్రశేఖర్ బి. హరిశర్మ కె శివ వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గఫూర్ మాట్లాడుతూ దేశంలో సామాన్యులకు న్యాయం జరగడం లేదన్నారు. బూర్జువాలు, పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తుల నుంచి శ్రామిక కర్షక వర్గం చేతుల్లోకి రాజ్యాధికారం వచ్చినప్పుడే అందరికి న్యాయం జరుగుతుందన్నారు. సామ్రాజ్యవాదాన్ని నాశనం చేయడంతోనే కార్మికవర్గ రాజ్యస్థాపన సాధ్యమవుతుందంటూ చెప్పారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పేదలంతా కలిసికట్టుగా పోరాటం చేయాలంటూ పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పేదలంతా కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం, పెత్తందారీ ధోరణి కారణంగానే ఇజ్రాయెల్- హమాస్ నడుమ, రష్యా - ఉక్రెయిన్ నడుమ యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం యుద్ధనీతిని తప్పి గాజాలోని ఆసుపత్రులు, పాఠశాలలపై దాడులకు అమానవీయ దాడులకు దిగడం అత్యంత హేయమన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం వెంటనే గాజా లెబనాన్లపై దాడులను ఆపాలన్నారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలంటూ కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆరెస్సెస్ విధానాన్ని అమలు చేస్తూ సామ్రాజ్యవాద అనుకూల విధానాన్ని అనుసరిస్తోందంటూ ఆయన మండిపడ్డారు. ఇజ్రాయిల్- పాలస్తీనాల నడుమ యుద్ధంలో మోడీప్రభుత్వం ఇజ్రాయెల కు మద్దతునిస్తుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్రప్రభుత్వం రైతులు, శ్రామికులు, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పొరేట్, మతోన్మాదులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. దేశప్రజల నడుమ ఐక్యతను దెబ్బతీసేలా మతాల పేరుతో దాడులను ప్రోత్సహిస్తోందంటూ మండిపడ్డారు. ఢిల్లీ, యుపిలలో ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ పోరాడే వారి ఇళ్లను బుల్ డోజర్లతో కూల్చివేయడం బిజెపి పాలకుల దమననీతికి తార్కాణమన్నారు. చట్టసవరణ చేయడం ద్వారా వక్ఫ్ బోర్డులో హిందువులను సభ్యులుగా నియమించాలని మోడీప్రభుత్వం చూస్తోందంటూ ఆరోపించారు. రూ.49 లక్షల కోట్ల కేంద్రబడ్జెట్లో రాష్ట్రానికి లక్షకోట్లు నిధులు కేటాయిస్తే కరువును పారదోల వచ్చునన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తామని ప్రజలను మభ్యపెట్టిందన్నారు. రాయలసీమ అభివృద్ధి చేసి ప్రత్యేక హైకోర్టును నిర్మించి నీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎటువంటి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు దాదాపు రూ.18 వేల కోట్లు పెంచారన్నారు. అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం 10 వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. నవంబర్ 26న సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని కార్యక్రమానికి ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడాది ప్రారంభం నుంచి జిల్లాలో సరిగ్గా వర్షాలు కురవలేదన్నారు. జిల్లాలో వేరుశనగ, వరి పంటలు వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. హంద్రీనీవా నీటిని వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా జిల్లాలను నీటిని సరఫరా చేయాలని కోరారు. రాబోయే రోజులలో ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేస్తామని తెలిపారు. కడప బెంగళూరు రైల్వే పనులు, మదనపల్లె ఫైల్ల దగ్ధం సమస్యల కోసం అందరం కలిసి పోరాడాలని పేర్కొన్నారు. అనతరం జిల్లా కమిటీ సభ్యులు నేతలు రామాంజులు, రవికుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్. నరసింహులు ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, వెంకట రామయ్య, రాజమ్మ, జావిద్, సిఐటియు జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, అధ్యక్షుడు చంద్రశేఖర్, హరిశర్మ, శివతో పాటు నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మహాసభల్లో తీర్మానాలు..

విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలి. జిల్లా అభివృద్ధికి కేంద్ర-రాష్ట్రప్రభుత్వాలు రూ.10వేల కోట్లు కేటాయించి మూడేళ్ళలో ఖర్చుచేయాలి. జిల్లాలోని అన్నమయ్య, ఫించా, ముదివేడు ప్రాజెక్టుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి. అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులకు పునరావాసం, పునర్నిర్మాణం ప్యాకేజిలను ఇవ్వాలి. రాయచోటి ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా, మదనపల్లె ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా, రాజంపేటలో వందపడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయాలి. కడపలో ప్రభుత్వరంగంలో ఉక్కుపరిశ్రమను ఏర్పాటు చేయాలి. మదనపల్లెలో చేనేతక్లస్టర్లను ఏర్పాటు చేయాలి. కడప-మదనపల్లె- బెంగళూరు రైల్వేలైన్ పనులకు అత్యంత ప్రాధాన్యత కల్పించి పూర్తిచేయాలి.


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు బి. రమేష్‌బాబు

మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యం

రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేసి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని ఆరోగ్యంగా జీవించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేతాజీ స్కూల్లో 68 వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా, అండర్ 17 బాల, బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం ఎంత సంతోషంగా ఉందన్నారు. ఈనెల 27, 28, 29 మూడు రోజులు పాటు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి, మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని చెప్పారు. ఈ పోటీలలో ఓడినవారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం విద్య, ఉద్యోగాలలో మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గతంలో కొంతమంది దొంగ సర్టిఫికెట్లు తెచ్చుకొని వ్యాయామ ఉద్యోగాలు పొందేవారని, ఈ ప్రభుత్వంలో అలాంటి వాటికి చోటు లేదని స్పష్టం చేశారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రాయచోటి పట్టణంలో అన్ని కార్యక్రమాలకు వేదికగా ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకొస్తామని చెప్పారు. మూడు రోజులపాటు జరిగే కబడి పోటీలలో 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసే ందుకు ముందుకు వచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సభా కార్యక్రమానికి ముందుగా ప్రార్థనాగీతం, జాతీయ పతాక ఆవిష్కరణలతో కార్యక్రమాలకు శ్రీకారం చుటారు. కార్యక్రమానికి హాజరయిన అతిథులు క్రీడా జ్యోతి వెలిగించి క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల గౌరవ వందనం మంత్రి స్వీకరించి, అంతరం కబడ్డీ క్రీడా కారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

సురక్షిత ప్రయాణమే ఆర్‌టిసి లక్ష్యం

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్‌టిసి ముఖ్య ఉద్దేశమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలో 10 నూతన ఆర్‌టిసి బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజులలో మరిన్ని నూతన ఆర్‌టిసి బస్సులను ప్రారంభించి ప్రజలకు సులభతరమైన రవాణా సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రయాణికుల సంక్షేమమే ముఖ్యంగా భావిస్తోందని ఇకనుంచి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నూతన బస్సుల్లో హైదరాబాద్‌కు 2 ఇంద్ర బస్సులు, మదనపల్లె ఒకటవ డిపో నుంచి ఒక సూపర్ లగ్జరీ, ఒక ఎక్స్ప్రెస్, మదనపల్లె రెండవ డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీలు, ఒక ఎక్స్ప్రెస్, పీలేరు డిపో నుంచి ఒక ఎక్స్ప్రెస్, పుంగనూరు డిపో నుంచి రెండు పల్లెవెలుగు బస్సులను నడుపుతారని చెప్పారు. ఈ సందర్భంగా బెలూన్లతో అలంకరించిన 10 బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.


జెండా ఊపి నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి

నాటు సారా నివారణే లక్ష్యం

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా నాటు సారాను అరికట్టడమే తమ లక్ష్యం అని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాల్లో నూతన మద్యం పాలసీ అమలు, మద్యంలో ఎంత ఆదాయం వచ్చిందో, నాణ్యమైన మధ్యం సరఫరా చేయించడం, నాటు సారాను ఎలా అరికట్టాలో ప్రజాశక్తి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.



ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లాల్లో ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్లున్నాయి. రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, మొలకలచెరువు, మదనపల్లి, వాయల్పాడు, పీలేరు, కోడూరు, రాజంపేట ప్రాంతాలలో ఉన్నాయి.

జిల్లాలో మద్యం షాపులు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా నూతన మద్యం షాపులు 111 ఉన్నాయి.3 నూతన మద్యం షాపులు ఏర్పాటు వల్ల జిల్లాకు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ. 42 కోట్ల 20 లక్షలు వచ్చింది. ఈ నెల 16 నుంచి ఇప్పటివరకు రోజుకు ఒక్కొక్క షాపుకు పది లక్షలు చొప్పున రూ .11.10 కోట్లు జిల్లాకు ఆదాయం వచ్చింది.

మద్యం దుకాణాలకు లైసెన్సులు ఇచ్చారా?

ప్రస్తుతం తాత్కాలిక లైసెన్సులు ఇచ్చాం. మద్యం షాపులు యాజమాన్యం బ్యాంకు పత్రాలు సమర్పిస్తే 10 రోజులలో ఒరిజినల్ లైసెన్సులు రెండు సంవత్సరాలు వరకు ఇస్తాం .

దుకాణల నిర్వహణకు అధికార పార్టీ నాయకులను అడ్డపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి? దీనిపైన మీరు ఏమంటారు?

జిల్లా వ్యాప్తంగా ఈనెల 14న నూతన మద్యం షాపులకు లక్కీ డ్రా జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహించాం. అక్కడ కలెక్టర్ పర్యవేక్షణలో ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా ఎటువంటి రాజకీయ ఒత్తుళ్ల లేవు.

జిల్లాలో బార్లు, రెస్టారెంట్లు ఎన్ని ఉన్నాయి? వాటి గడువు ఎప్పటి వరకు ఉంది?

జిల్లావ్యాప్తంగా మొత్తం 11 బార్లు ఉన్నాయి. వాటికి 2025 సంవత్సరం ఆగష్టు వరకు గడువు వుంది.

నాట సారాను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నాటు సారా అరికట్టడానికి నిరంతరం దాడులు నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా నాటు సారా తయారు చేస్తే కటింగ్ సెల్లు తీసుకుంటాం. సారా ప్రభావిత గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపడతున్నాం.

జిల్లాలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఎంతమంది ఉన్నారు? సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు మొత్తం 126 మంది సిబ్బంది వున్నారు.సిబ్బంది కొరత లేదు. జిల్లాలో నూతన మద్యం విధానం అత్యంత పారదర్శకంగా జరుగుతోంది. నూతన మద్యం షాపులలో అన్ని రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఎవరు ఎటువంటి అపోహాలు పెట్టుకోవద్దు.

సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలి

- చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రిన్సిపల్ జ్యోతిర్మయి

ప్రజాశక్తి-రాయచోటి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. పట్టణంలోని డైట్ కళాశాలలో ఏర్పాటుచేసి సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలని తెలిపారు. అమెరికాలో నివాసం ఉంటూ ఈ సమావేశానికి విచ్చేసిన సాఫ్‌వేర్ ఇంజినీర్ ఇంజనీర్ గౌతమ్ మాట్లాడుతూ మనిషి అభివృద్ధికి విద్య ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు.నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కంటి వైద్యులు రెడ్డన్న మాట్లాడుతూ తల్లిదండ్రులు చెప్పే మంచి మాటలు విని ఆచరించాలని, సమాజం పట్ల క్రమశిక్షణతో మెలగాలని, మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ ప్రజలను మూఢనమ్మకాలు పట్టి పీడిస్తున్నాయని వాటి తొలగించాల్సిన బాధ్యత అందరి మీద ఉందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 9 ,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు రెండు జట్లను ఎంపిక చేసామని తెలిపారు. జిల్లాలో 30 మండలాల నుంచి 42 టీంలు 126 మంది విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టెస్ట్ లో పాల్గొన్నారని తెలిపారు . గెలుపొందిన వారి వివరాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి వివేకానంద మున్సిపల్ హై స్కూల్, మదనపల్లి విద్యార్థులు ధీరజ్, కార్తీక్, లహరి ప్రయివేట్ స్కూల్ విభాగం నుంచి శ్రీ సాయివిద్యాలయ, రాజంపేట విద్యార్థులు చందు ,మనస్వింద్, సాయి సంతోష్ రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ నేటి ప్రపంచాన్ని శాసిస్తున్నాయని విద్యార్థులు ఈ అంశాలలో నైపుణ్యం సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివయ్య ,రామకృష్ణ ,జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు ,రామయ్య ,ప్రతాపరెడ్డి, శివారెడ్డి ,రౌఫ్ భాషా ,నాగేశ్వరరావు ,అరవింద రెడ్డి జయచంద్ర ,శాస్త్రి ,సుభాషిని పాల్గొన్నారు.


చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

'సాల్ట్' ఒప్పందాన్ని రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రపంచ బ్యాంకుతో రాష్ట్రంలో అమలవుతున్న సాల్ట్ పథకం ఒప్పందాన్ని రద్దు చేయాలని, విద్యా రంగంలో ప్రపంచ బ్యాంకు విధానాలకు స్వస్తి పలకాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబిర్ పేర్కొన్నారు. ఆదివారం అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా జరుగుతున్న విధానాల వల్ల ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతోందని అన్నారు. ప్రాథమిక పాఠశాలల విభజన, తరగతుల విలీనంతో తీవ్ర నష్టం జరుగుతోంది. ఈ పథకం అమలు వల్ల ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌లు, అసంబద్ధ శిక్షణ కార్యక్రమాలు, అనవసర ఆన్‌లైన్ పనులు అధికమై ఉపాధ్యా యులను బోధన నుంచి దూరం చేస్తున్నది. అపార్ ఐడి తయారీ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ప్రశ్నార్థకంగా వున్న జిఒ 117 ను విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల నిర్వహణకు పూర్తి స్థాయిలో గ్రాంట్లు మంజూరు చేయాలని, మన బడి-మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని కోరారు. అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఖాళీగా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న హరిప్రసాద్

'సాయిబాబా' ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి-రాయచోటి : ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఘనమైన నివాళులని ప్రజా సంఘ నేతలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో హక్కుల నేత, విద్యావేత్త, మేధావి ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ ఉమ్మడి కడప జిల్లా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాయిబాబా ఈ దేశ ప్రజలను, ఈ దేశాన్ని ప్రేమించడం వల్లనే పాలకులకు కంటగింపుగా మారాడని పేర్కొన్నారు. దేశంలోని అణగారిన ప్రజల హక్కులకోసం, ఆదివాసీల కోసం, మహిళ లహక్కులకోసం, ఎనలేని కృషి చేసారనీ, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడినందునే ఆయన పై కుట్ర కేస్ బనా యించారని అన్నారు. సిపిఐ జిల్లా నాయకులు పిఎం.నరసింహులు మాట్లాడుతూ సాయిబాబా మధ్యభారతం అడ వుల్లో ఉన్న అపార ఖనిజ సంపదను కార్పొరేట్ లకు దోసిపెట్టడానికి, అడవుల్లో జీవిస్తున్న ఆదివా సీలను,అడవుల నుండి వెళ్ళ గొట్టడానికి భారత ప్రభుత్వం ఆదివాసీలపై యుద్ధం చేస్తున్నది.ఈ విషయా లన్నీ సాయిబాబా తమ రచనలద్వారా బయట ప్రపంచానికి తెలియ చేస్తున్నాడనే కారణంతో నే ఆయ నను జైల్లో పెట్టారని అన్నారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ నాయక్ మాట్లాడుతూ తొంబై శాతం వికలంగుడైన సాయిబాబా తన మేధస్సు ద్వారా ప్రజలను చైతన్య పరిచారని అన్నారు. మరణానికి భారత ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి నాయకులు సుధీర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సాయిబాబాపై అక్రమ కేసులు బనా యించడం దుర్మార్గమని అన్నారు. జైల్లోనే ఆయన ఆరోగ్యం క్షీ ణింప చేసి ఆయన మరణానికి కారణం అయ్యారని అన్నారు. ఇప్పటికైనా ఉప చట్టాన్ని రద్దు చేసి జైల్లో ఉన్నవారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం అధ్యక్షులు సురేష్ బాబు, ఉపాధ్యక్షులు, రైతు సంఘం నాయకులు, రంగారెడ్డి, బహుజన రక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.


జెసిబి ద్వారా కాలనీకి రోడ్డు ఏర్పాటు

కాలనీ దారి సమస్యకు పరిష్కారం

ప్రజాశకి-మదనపల్లె అర్బన్

మండలంలోని కొండామర్రిపల్లి పంచాయతీ ఇసుకనూతపల్లి గ్రామంలో గమ్ ఫ్యాక్టరీ సమీపంలోని రోడ్డును అక్రమార్కులు ఆక్రమించుకుని కబ్జా చేయడంతో దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. దారి సమస్యను ఎమ్మెల్యే షాజహాన్‌బాషాదృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ, ఎంపిడిఒ, పంచాయతీ సెక్రెటరీ, పోలీసు అధికారులతో కలిసి శనివారం దారి సమస్య ఉన్న ప్రాంతాన్ని సందర్శించారు. దారిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. వెంటనే కాలనీకి రోడ్డు వేయాలని స్థానిక టిడిపి నాయకులు జయ రాం యాదవ్, వెంకటరమణ యాదవ్, కృష్ణమూర్తిలను ఆదేశించారు. ఆదివారం జెసిబితో కాలనీకి రోడ్డు వేయించారు. ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న దారి ఏర్పాటు కావడంతో కాలనీ ప్రజలు, మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.


ఆలయ సిబ్బందికి నగదును అందిస్తున్న ఎంఇఓ తాతయ్య

గంగమ్మ ఆలయానికి రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని తలుపుల గ్రామ పంచాయతీలో వెలిసిన ఉలవల గంగమ్మకు పులిచెర్ల మండల విద్యాశాఖ అధికారి పి.తాతయ్య రూ.10వేలు కానుకగా సమర్పించుకున్నారు. ఆదివారం ఆయన అమ్మ వారిని దర్శించుకుని, ఆలయ అభివృద్ధికి తన వంతు బాధ్యతగా ఈ నగదు కానుకను ఆలయ ధర్మకర్తలకు అందించారు. ఆలయ అర్చకులు గణేష్‌రాజు అమ్మవారికి ప్రత్యేక పూజ చేసి ఎంఇఓకు విశేష వస్త్రంతో పాటు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఉదారంగా కానుకలు సమర్పించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తలు వెంకటరమణ నాయుడు, హరినాథ్ నాయుడు, సాగర్ రెడ్డి, ఆలయ అర్చకులు గణేష్ రాజు, భక్తులు పాల్గొన్నారు.


పశుగణన పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న చమర్తి జగన్మోహన్‌రాజు

పశుగణనకు సహకరించండి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ఓడివీడు పంచాయతీలో పశు గణన పోస్టర్‌ను రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల గణాంకాల సేకరణకు వచ్చే పశు వైద్య సిబ్బందికి పశుపోషకులు సహకరించాలని పిలుపునిచ్చారు. సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు. పశుగణన కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని పశు వైద్యులను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, వెటర్నరీ అసిస్టెంట్ ఆంజనేయులు, మండల యువనాయకుడు భాస్కర్‌రాజు, మండల బిసి నాయకుడు చలపతి, రాజారాం, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కలకడ పోలీసు స్టేషన్‌లో దసరా మహోత్సవం

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ పోలీసుస్టేషన్‌లో దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలకడ సిఐ గురునాథ ఆధ్వర్యంలో దసరా పండగను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు పేర్కొన్నారు. తెలుగుదనం ఉట్టి పడేలా పోలీసు సిబ్బంది దుస్తులు ధరించి ఉగాది పండుగను తలపించేలా దసరా పండుగను నిర్వహించుకున్నారు.పోలీసు స్టేషన్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించి, ఆయుధపూజ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

క్రికెట్‌లో మదనపల్లె పేరు మార్మోగాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర క్రికెట్‌లో మదనపల్లె పేరు మార్మోగాలని మదనపల్లె సీనియర్ క్రికెటర్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో కెఎస్ఎస్‌బి క్రికెట్ క్లబ్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారులు, భవిష్యత్ క్రికెట్ క్రీడాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారులు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా మదనపల్లెలో అసాధారణ క్రికెట్ ఆడే క్రీడాకారులు ఉన్నారని కానీ వారిని ప్రోత్సహించే వారు లేక నియోజకవర్గ స్థాయిలోనే మిగిలి పోయారని అన్నారు. క్రీడాకారులలోని సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగి నేషనల్ టీమ్‌లో ఆడే సత్తా మదనపల్లి క్రీడాకారులకు ఉందన్నారు. ప్రస్తుతం కెఎస్ఎస్ బి క్రికెట్ క్లబ్ భవిష్యత్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. వీరికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, సహాయ సహకారాలు అందిస్తామని సీనియర్ క్రీడాకారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు సిరాజ్, పియాజ్ అహమ్మద్, ప్రసాద్ రెడ్డి, నూర్ అహమ్మద్, రంజి క్రీడాకారుడు షోయబ్ అహమ్మద్, హరిప్రసాద్, కోచ్ జనార్దన్, చంద్రశేఖర్, ఆదోన్, జ్యోతిష్ పాల్గొన్నారు.

జిల్లాలో 333 దుకాణాలకు అనుమతులిచ్చాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


మాట్లాడుతున్న అనిల్ కుమార్

అన్నమయ్య జిల్లాలో 333 తాత్కాలిక దుకాణాలకు అనుమతులిచ్చామని అన్నమయ్య జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం మదనపల్లె ఫైర్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు. దీపావళి సందర్భంగా ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బాణాసంచా కాల్చేటప్పుడు చిన్న పిల్లలు, పెద్దలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక మిషన్ కాంపౌండ్, బీటి కాలేజ్ గ్రౌండ్, వేంపల్లి, కదిరి రోడ్డు లోని మసీదు కాంప్లెక్స్ మైదానంలో షాపులు ఏర్పాటు చేస్తున్న స్థలాలను పరిశీలించారు. వ్యాపారస్తులకు తగు సూచనలు తెలియజేశారు. టపాసులకు పక్కపక్కనే అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం నూతన అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడుగా బలిజ వేణుగోపాల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులంతా బలిజ నాయకత్వాన్ని బలపరిచారు. సంఘ ఇతర నాయకత్వాన్ని, సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తనను ఆర్యవైశ్య సంఘానికి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ఆర్యవైశ్యులందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కూన సత్యం, జూటూరి అరవింద్, క్షీపురం వెంకటేష్, ప్రణీత్, రేపూరి నాగరాజు, సాయిపల్లి శ్రీనివాసులు, రాచపల్లి కృష్ణమూర్తి, మల్లికార్జున, గణపతి, సుధీర్, బాలాజీ, యలు, తులసి కృష్ణ, ఎర్రయ్య శెట్టి, రాజేష్ పాల్గొన్నారు.


ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడితో నూతన కార్యవర్గం

ఉద్యాన విద్యలో కొత్త కోర్సులకు శ్రీకారం

-ఇన్‌ఛార్జి విసి డాక్టర్ గోపాల్

ప్రజాశకి- రైల్వేకోడూరు

ఉద్యాన విద్యలో నైపుణ్య అభివృద్ధి,కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టామని ఇన్‌ఛార్జి విసి డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. మండలంలోని అనంతరాజుపేట వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన కళాశాలను ఆయన సందర్శించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఉద్యాన ఆవశ్యకత,ఉపాధి అవకాశాలను గుర్తించాలని పిలుపునిచ్చారు.జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంక్ సాధించేలా ఉద్యానవర్సిటీ ముంద డుగులు వేస్తోందని తెలిపారు. అటవీ, వ్యవసాయ యాంత్రికరణ, కూరగాయలు,పండ్ల ప్రాసెసింగ్ వంటి కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టిందని వివరించారు.ఈ విద్యా సంవత్సరం నుంచి కీటక, తెగుళ్ళ విభాగాలలో పీజీ, పిహెచ్‌డి ప్రవేశాలు ప్లాంట్ బ్రీడింగ్ విభాగాల్లో పిజీ ప్రవేశాలు విద్యార్థులకు కల్పిస్తామని తెలిపారు. పీజీ పిహెచ్‌డి విద్యార్థులకు వారి పరిశోధన వ్యాసాలను మంచి గుర్తింపు పొందిన జర్నల్స్‌లో ప్రచురించుటకు తగిన ఆర్థిక వెసులుబాటు కల్పిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో విద్యతోపాటు పలు సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొనేందుకు వీలు కలుగుతుందని అన్నారు.

మహిళా రక్షణ, సాంస్కృతిక సెల్ ప్రారంభం

మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో మహిళా రక్షణ సాంస్కృతిక కేంద్రాన్ని ఉద్యాన వర్సిటీ ఉపకులపతి ఆవిష్కరించారు. మహిళ రక్షణ సెల్ చైర్మన్‌గా డాక్టర్ సి హెచ్ రూత్ ను, సభ్యులుగా డాక్టర్ సదరున్నీసా, డాక్టర్ ముకుందలక్ష్మి, డాక్టర్ గిరీషడాక్టర్ దీప్తి కిరణ్‌లను నియమించామని తెలిపారు .మహిళా ఉద్యోగులు ఉద్యాన విద్యార్థునులు భద్రతను ప్రోత్సహించి సురక్షిత వాతావరణం కలిగించే దిశగా ఈ సెల్ పనిచేస్తుందని తెలిపారు. సాంస్కృతి కేంద్రం ద్వారా విద్యార్థుల్లో దాగివున్న సంస్కృతి, కళలను వెలికితీసి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. ఆచార్యులు రచించిన పుట్టగొడుగుల పెంపకం, బొప్పాయి సాగువంటి పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిటి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల సీనియర్ ప్రొఫెసర్ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, డాక్టర్ కెఎం. యువరాజ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


మహిళా రక్షణ, సాంస్కృతిక సెల్‌ను ప్రారంభిస్తున్న విసి గోపాల్

నగర వనంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం : ఎమ్మెల్యే


నగర వనంలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని స్థానిక పుంగనూరు రోడ్డు అటవీశాఖ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న నగర వనాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్ బాబుతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సందర్శించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్న నగర వనం పనుల పట్ల ఎమ్మెల్యే సంతృప్తిని వ్యక్తం చేశారు. పిల్లలు ఆడుకునేందుకు పార్కుతో పాటు, వాకింగ్ ట్రాక్, బుద్ధ ఫౌంటెన్, యోగా సెంటర్‌ను నగర వనం పార్కులో అభివృద్ధి చేస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ ఎమ్మెల్యేకు వివరించారు. నగరవనం ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లా డుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన నగరవనం పూర్తయితే పట్టణ ప్రజలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం, పిల్లలు ఆడుకునే వస్తువులతో పాటు, ఎంతో సుందరంగా పార్కును అభివృద్ధి చేస్తుండడం చాలా సంతోషమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి నగరవనం పార్కును అభివృద్ధి చేసేందుకు సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాటకొండ గుర్రప్పనాయుడు, టిడిపి నాయకులు ఎఎస్ఆర్ థియేటర్ రాజా, జెసిబి వేణు, రెడ్డిరాయల్, సురేంద్రరెడ్డి, మేస్త్రి మల్లికార్జున, పూలకుంట్ల హరి బాబు, రఘుపతి నాయుడు, మంజునాథ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం : 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్క కార్యకర్త నాయకులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం ఓధివీడు గ్రామంలో ఇలవేల్పు ఓదివీతమ్మకు, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేపట్టిన విధంగా సభ్యత్వ నమోదు కార్డుతో బీమా వసతి కల్పించారన్నారు. మృతి చెందిన వెంటనే వారికి బీమా సకాలంలో అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా సభ్యత్వ నమోదు చేయించుకుని కార్డు పొందాలని సూచించారు. ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో తెదేప మండల అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునచారి, వీరబల్లి మాజీ సింగల్ విండో అధ్యక్షులు కల్లూరి రామ్మోహన్ రెడ్డి, మండల నాయకులు రెడ్డప్ప రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, వై. శ్రీధర్ రెడ్డి, పాపిరెడ్డి, పద్మనాభరెడ్డి, మండల యువ బీసీ నాయకుడు చలపతి, మండల యువ నాయకుడు భాస్కర్‌రాజు, సుధాకర్ రాజు, ఎల్‌జి రమేష్‌రాజు, టిడిపి నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు. **రామాపురం :**కార్యకర్తలకు వారి కుటుంబాలకు అండగా నిలిచే టిడిపినేనని మండల టిడిపి గాలివీడు సురేందర్ రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి రామకృష్ణ గౌడ్ పేర్కొ న్నారు. రాష్ట్ర రవాణా యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదే శాల మేరకుమండలంలోని చిల్లూరు పంచాయతీలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందితే రెండు సంవత్సరాలు ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. టిడిపి కార్యకర్తలకు వారి కుటుంబాలకు అండగా నిలిచి నిలుస్తుందని అన్నారు. టిడిపి సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి మరణించిన రోజు అంత్య క్రియ ఖర్చులకు పదివేలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నియోజ కవర్గ ఐటిడిపి ఇన్‌ఛార్జి, మండల తెలుగు యువత అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, చిట్లూరుగ్రామ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, దేవరెడ్డి, గణేష్, ధన ఓబులేష్ పాల్గొన్నారు.


వీరబల్లి: భోజనాన్ని వడ్డిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

మానవత సేవలు అభినందనీయం


అతిథులను సన్మానిస్తున్న మానవత సభ్యులు

ప్రజాశక్తి-రాయచోటి

కష్ట సమయాలలో గుర్తుకు వచ్చే సంస్థ మానవత సంస్థేనని, ధర్మ గుణాన్ని, సేవా భావాన్ని నింపుతున్న మానవత సంస్థ సభ్యులకు ప్రత్యేక అభినందనీయమని ట్రాఫిక్ సిఐ విశ్వనాథ రెడ్డి, సీనియర్ ప్రభుత్వ వైద్యులు లక్ష్మీప్రసాద్, విద్యుత్ శాఖ ఎఇ లక్ష్మయ్య పేర్కొన్నారు. ఆదివారం కొత్తపేటలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్‌బాషా, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డిల అధ్యక్షతన మానవత నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రాఫిక్ సిఐ విశ్వనాధరెడ్డి, సీనియర్ ప్రభుత్వ వైద్యులు లక్ష్మీప్రసాద్, విద్యుత్‌శాఖ ఎఇ లక్ష్మయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు పబ్బీశెట్టి సురేష్, బిసి నాయకులు ఇడగొట్టు నాగేశ్వరలు హాజరయ్యారు. బాడి ఫ్రీజర్ బాక్స్‌తో పాటు అంబులెన్స్, శాంతి రథంల ద్వారా కష్ట సమయాలలో ఉన్నవారికి సేవలు అందిస్తున్నట్లు అతిథిలుకు వివరించారు. మానవత సభ్యులు విద్యార్థులకు నైతిక విలువల పట్ల అవగాహన పర్యావరణాన్ని పెంపొందించేలా మొక్కలు నాటే కార్యక్రమాలు మా సంస్థ ద్వారా చేస్తున్నామన్నారు. మానవత సంస్థ ను ఉద్దేశించి అతిథులు మాట్లాడుతూ మానవత సంస్థ అందజేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఏ సేవా చేయాలన్నా, ఆ సేవలను నిరంతరం కొనసాగించాలన్న అందరి ఐకమత్యం తోనే సాధ్యపడుతుందన్నారు.ఇటువంటి సేవా కార్యక్రమ సమీక్షా సమావేశంలో పాల్గొనడం చాలా సంతోషదాయకం అన్నారు. అతిధులును మానవత సంస్థ సభ్యులు శాలువాతో సన్మానించి మానవత మెమొంటోలను అందించారు. కార్యక్రమంలో మానవత గౌరవ సల హాదారులు వెంకటరమణ, కేంద్ర కమిటీ డైరెక్టర్ సహదేవరెడ్డి, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు బ్రహ్మానంద రెడ్డి, కన్వీనర్ చింతంరెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ అధ్యక్షులు గుండ్లూరు వెంకటేష్, సభ్యులు అశ్రాఫుల్, నాగేశ్వరనాయక్, కుటుంబసభ్యులు సుదర్శన్‌రెడ్డి, రామచంద్రరెడ్డి,బి.ఎ.నాగయ్య, పాల్గొన్నారు.


సేవలు మరింతగా విస్తృత పరచాలి

పీలేరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతపరచాల్సిన అవసరం ఉందని అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు. పీలేరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారి సమీక్ష సమావేశం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మడపంలో అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ మానవత సంస్థ తరపున పట్టణంలో ప్రతినెలా ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నెలలో ఒక వినూత్న సేవా కార్యక్రమం చేపట్టాలని భావిస్తు న్నట్లు చెప్పారు. అందుకోసం స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు, అనాథ ఆశ్రమం లోని పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలపారు. మానవత చైర్మన్ డాక్టర్ వి.రామచంద్ర మాట్లాడుతూ మానవత సంస్థకు తమ వంతు విరాళంగా ఇచ్చిన చైతన్య జూనియర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సి. చంద్ర య్యకు మానవత తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి జగన్మోహన్, కార్యదర్శి బివి సురేష్, కో చైర్మన్ ఆర్ కృష్ణమూర్తి, కన్వీనర్ వై. వెంకటరమణ, సభ్యులు ఎం. నాగరాజు, వై. రామకృష్ణ, ఎస్. మహమ్మద్ షఫీ, ఖలీల్‌బాషా, అక్రమ్ బాష, రహత్ బాష, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు విజయకుమారి, రాయ ఆనంద, పెంజూరి అశోక్, పోతంశెట్టి రమేష్, సుధాకర్ బాబు, రాజేంద్ర పాల్గొన్నారు.

మండల అధ్యక్షులుగా రెడ్డెప్ప నియామకం

ప్రజాశక్తి-రామసముద్రం

అన్నమయ్య జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు జరిపిటి రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని టిటిడి కల్యాణమండపం నందు వడ్డెర సంఘం అధ్యక్షుడు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామసముద్రం మండలం వడ్డెర సంఘం అధ్యక్షులుగా ఆర్. నడింపల్లి పంచాయతికి చెందిన రెడ్డప్పను, గౌరవ అధ్యక్షులుగా ఎర్రబోయనపల్లి కొనంగి వెంకటప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ పరిధిలోని నాయకులు మాట్లాడుతూ మన వడ్డెర కులస్తులు రాజకీయాల్లో రాబోవు కాలంలో ఉన్నత పదవులు అలంకరించి రాష్ట్రం జిల్లా డివిజన్ నియోజకవర్గం మండల స్థాయి పదవులను సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. వడ్డెర కులస్తులు కలిసికట్టుగా రాజకీయ పార్టీలకు అతీతంగా మన హక్కుల కోసం పోరాడాలని వారు తెలిపారు. నూతనంగా ఎన్నికైన రెడ్డప్ప మాట్లాడుతూ మండలంలోని వడ్డెర కులస్తులు అందరూ కలసి మాజీ సర్పంచ్ వెంకటప్పను గౌరవ అధ్యక్షులుగా, తనను మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వడ్డెర కులస్తులను ఎస్‌టి జాబితాలో చెర్చేవరకు పోరాడుతానని మండలంలోని వడ్డెర సంఘంలోని కులస్తులకు ఎవరికి ఏ ఆపదొచ్చిన వారికి అండగా నేనుంటానని తెలిపారు. మాల మహానాడు అధ్యక్షులు క్రిష్ణప్ప రెడ్డెప్పను దుశ్శాలువాతో సన్మానించి పూలమాల వేసి అభినందించారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు కొనంగి వెంకటప్ప, నాగమల్లప్ప, రెడ్డప్ప ,పద్మనాభ రాజు, జిల్లా కమిటీ సభ్యుడు దాసర్లపల్లి వాల్లెప్ప, శామప్ప ,ముని వెంకటప్ప, శ్రీరాములు , రెడ్డెప్ప, సాంకేరి గంగులప్ప, వెంకటరమణ, వడ్డెర సంఘం నాయకులు కమిటీ సభ్యులు, జక్కులవారిపల్లి, ఎర్రబోయనపల్లి, శ్రీరాములపల్లి, ఆర్.కమతంపల్లి, జంగాలపల్లి, నరసాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న సంఘు సభ్యులు

క్రైం కార్నర్

బైక్ ఢీకొని మహిళ పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బైక్ ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి బంధువుల వివరాల మేరకు..గుర్రంకొండ మండలంలోని చింతమా కులపల్లికు చెందిన రెడ్డప్ప భార్య పి.రెడ్డమ్మ మనవడితో కలిసి ద్విచక్ర వాహ నంలో మదనపల్లెకు వెళ్లిందని అన్నారు. అక్కడ నుంచి నిమ్మనపల్లి రోడ్డు లోని ప్రయివేట్ స్కూల్‌లో చదువుకుంటున్న మనవడిని దీపావళి పండుగకు తీసుకొని వెళ్లేందుకు వెళ్లారు. స్కూల్లో ఉన్న మనవడిని తోడుకుని బైకులో స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలోని నిమ్మనపల్లి రోడ్డు బసినికొండ సర్కిల్ వద్ద ఎదు రుగా వస్తున్న మరో బైక్ ఢీకొందని చెప్పారు. ఈ ప్రమాదంలో రెడ్డెమ్మ తీవ్రంగా గాయపడడంతో స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూరుకు తీసుకెళ్లినట్లు తెలిపారు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన మదనపల్లెలో ఆదివారం జరిగింది. తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బెంగుళూరు రోడ్డు, చిప్పిలి సమీపంలోని సురభి కాలనీలో నివాసముంటున్న షేక్ జబీఉల్లా భార్య షేక్ మెహజాన్(29) కుటుంబ సమస్యలపై భర్తతో గొడవ పడినట్లు తెలిపారు. తీవ్ర మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో మరో వ్యక్తి ..

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. సిఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు..శనివారం రాత్రి గంటలకు ఆలేటిపల్లిలో నివాసమున్న పుంగునూరుకు చెందిన రాంబాబు(33) అనే వ్యక్తి ఏడాది క్రితం ఆలేటిపల్లికి చెందిన స్పందనతో ప్రేమ వివాహం చేసుకున్నాడని తెలిపారు. స్పందన వేరే వారితో వివాహేతర సంబంధం పెట్టుకొని కాపురానికి రాలేదన్నారు. మనస్థాపానికి గురైన రాంబాబు చెంది తరిగోడు వద్ద ఒక చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పది మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రహస్యంగా పేకాట ఆడుతున్న పది మంది పేకాట రాయుళ్లను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు..ఆదివారం మధ్యాహ్నం మండలంలోని యాలగిరిపల్లి సమీపంలోని వలసకొండ నందు సుమారు పదిమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందని అన్నారు. తమ సిబ్బందితో దాడులు చేసి వారి వద్ద నుంచి రూ.15,550 నగదును సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న స్కార్పియో వాహనం

- తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో స్కార్పియో వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. కడప జిల్లాకు చెందిన పర్యాటకులు గవర్నర్ బంగ్లా సమీపంలోని జిడ్డు కృష్ణమూర్తి సర్కిల్ వద్ద స్కార్పియో వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు.ఈ ప్రమాదంలో ఎవరికి ఎటు వంటి ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరి స్థానికులు పీల్చుకున్నారు. హార్సిలీహిల్స్‌లో వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని పర్యాటక అధికారులు సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణకు పర్యాటకులు సహకరించాలని కోరారు.

50 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు బైక్‌తో సహా 50 లీటర్ల సారాను సీజ్ చేశారు. మదనపల్లె ఎక్సైజ్ సిఐ భీమలింగ కథనం మేరకు.. మదనపల్లె మండలంలోని బొమ్మనచెరువు రోడ్డులో ఆదివారం సిబ్బందితో వాహనాలను సోదా చేస్తుండగా నారమాకుల తండాకు చెందిన బాణావత్ జగదీష్ నాయక్ స్కూటీలో 50 లీటర్ల నాటుసారా తీసుకొని మదనపల్లెకు వెళ్తూ సిబ్బందికి పట్టుబడినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి నుంచి సారా స్వాధీనం చేసుకొని బైకును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

భార్య, అత్తమామల నుంచి ప్రాణహాని ఉంది

-రక్షణ కల్పించాలని విభిన్న ప్రతిభావంతుడు వేడుకోలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కట్టుకున్న భార్య, అత్తమామల నుంచే కాకుండా న్యాయం కోసం వెళ్ళిన పోలీసుల నుంచి కూడా తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ రేషన్ డీలర్‌గా ఉంటున్న దేరంగుల నాగరాజు అనే విభిన్న ప్రతిభావంతులు పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బి.కొత్తకోట మండల కేంద్రానికి చెందిన తాను రేషన్ డీలర్‌గా జీవనం కొనసాగిస్తున్నానని తెలిపారు. 12 ఏళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన భాస్కర్ శాంతమ్మల కుమార్తె శోభాను వివాహం చేసుకున్నట్లు తెలిపారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. రెండేళ్ల క్రితం అత్తమామలు కర్ణాటక నుంచి అక్రమ మద్యం తీసుకొస్తూ విక్రయిస్తూ పోలీసులకు పట్టుపడ్డారని తెలిపారు. పోలీసుల నుంచి విడిపించుకోవడానికి తన భార్య శాంత తనకు తెలియకుండా ఇంటిలో నుంచి లక్ష రూపాయలు తీసుకెళ్లి వారికి ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రశ్నించిన తనతో గొడవపడి పుట్టింటికి వెళ్ళిపోయిందన్నారు. అప్పటినుంచి కక్ష పెంచుకొన్న భార్య, అత్తమామలు, బావమర్దులు చందు, పవన్ లు నాపైన, మా నాన్న పైన దాడి చేసి తీవ్రంగా కొట్టి హింసించారని ఆరోపించారు. రక్షణ కోసం బి. కొత్తకోట పోలీసులను ఆశ్రయిస్తే తనకు రక్షణ కల్పించకపోగా భార్య అత్తమామలు అక్రమంగా తనపైన ఇచ్చిన ఫిర్యాదు తో వరకట్న వేధింపులు కేసు పెట్టి వేధిస్తున్నారని వాపోయాడు. న్యాయం చేయాలని డిఎస్‌పి, ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. భార్య, అత్తమామలు సుపారి ఇచ్చి తనను చంపేందుకు కూడా ప్రయత్నం చేశారని, ఆ విషయమై తాను ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోగా కనీసం విచారణ కూడా చేయలేదని అన్నారు. ప్రాణ భయంతో ప్రతీరోజు బిక్కుబుక్కు మంటు గడుపుతున్నానని చెప్పాడు. ఉన్నతాధికారులు స్పందించి విభిన్న ప్రతిభావంతుడినైన నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించి తగు న్యాయం చేయాలని కోరారు.

పుట్టినరోజు వేడుకల్లో 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలోని రాజ్ కన్వెన్షన్‌లో ఓబులవారిపల్లి మండలం బి కమ్మపల్లి గ్రామానికి చెందిన వేమన శ్రీనివాసులు నాయుడు, లతా ఆహ్వానం మేరకు వారి కుమార్తె ఐదవ సంవత్సరం పుట్టిన రోజు వేడుకకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కట్టా గుండయ్యా నాయుడు, టివి రమణారెడ్డి, గడిగోట సుబ్బరాయుడు, తాతంశెట్టి నాగేంద్ర పాల్గొన్నారు.